క్లుప్తంగా

సబ్సిడీపై గడ్డివిత్తనాల పంపిణీ

బల్లికురవ: పాడి పరిశ్రమను ప్రోత్రహించేందుకు 75 శాతం సబ్సిడీపై గడ్డివిత్తనాల పంపిణీ చేపట్టినట్లు మండల పశువైద్యాధికారి పి. మహేశ్వరరావు బుధవారం తెలిపారు. బల్లికురవ, పెద అంబడిపూడి, కూకట్లపల్లి, ఉప్పుమాగులూరు, పశువైద్యశాలల పరిధిలో ఒక్కో రైతుకు 30 కేజీల వరకు 12 టన్నుల విత్తనాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. సబ్సిడీ పోను 5 కేజీ సంచి రూ. 130 అందజేశామని.. 3 నుంచి 4 కోతలు ఇస్తుందని పశువైద్యాధికారి వివరించారు. నీటి వసతి ఉన్న భూముల్లో ఈ గడ్డి విత్తనాలు ఎద పెట్టుకోవాలని పశువైద్యాధికారి సూచించారు.

పాఠశాలకు మైక్ సెట్ బహూకరణ



పాఠశాలకు మైక్ సెంట్ అందిస్తున్న శ్రీగిరి శ్రీనివాసరావు

జె.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కీర్తిశేషులు హనుమంతురావు జ్ఞాపకార్థం వారి కుమారుడు ఉపాధ్యాయుడు శ్రీ గిరి శ్రీనివాసరావు మైక్ సెట్ బహూకరించారు. దీని విలువ రూ. 12500 ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయుడు శ్రీగిరి శ్రీనివాసరావు గతంలో 2017 నుంచి 25 వరకు ఈ పాఠశాలలోనే పని చేశారు. ప్రస్తుతం బదిలీపై పావులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమేపల్లి శ్రీనివాసరావు, పాఠశాల పూర్వవిద్యార్థి సంఘం ప్రధానా కార్యదర్శి తల్లపనేని రామాంజనేయులు, పాఠశాల ఉపాధ్యాయులు దాత శ్రీగిరి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యప్ప దీక్షలు ఆరంభం



బల్లికురవలో దీక్ష చేపట్టిన మాల ధారణ

బల్లికురవ: ఆశ్వయుజ మాసం విదియ సందర్భంగా బుధవారం బల్లికురవలో అయ్యప్ప దీక్షలు ప్రారంభం అయ్యాయి. కార్తీకమాసం ఆరంభానికి ముందే మండల దీక్షను గ్రామాల్లో చేపడుతున్నారు. బల్లికురవ సమీపంలోని భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో అర్చకుడు ఇంకొల్లు సుధీర్‌శర్మచే శివుని అయ్యప్పకు, కుమారస్వామికి పంచామృతాలతో అభిషేకం చేపట్టారు. బల్లికురవ, నక్కబొక్కలపాడు గ్రామాలకు చెందిన సుమారు 10 మందికి సుధీర్ శర్మ మాల ధారణగావించారు. గ్రామాల్లో స్వామియే శరణం అయ్యప్ప అంటూ శరణుఘోషలతో సందడి ప్రారంభమైంది. కార్తీకమాసం చివరివరకు ప్రతి గ్రామంలోనూ ఉదయం, సాయంత్రం భజనలతో సందడే సందడి నెలకొంది.

జీఎస్టీ 2.0పై డిబేట్

దొనకొండ: స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ నాని ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0పై డిబేట్ నిర్వహించారు. విద్యార్థులకు సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ గురించి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు కె.మల్లికార్జున క్లుప్తంగా వివరించారు. విద్యార్థులు జీఎస్టీ 2.0పై మాట్లాడారు. ప్రథమ బహుమతి షేక్ సమీమా, ద్వితీయ బహుమతి ఎస్.పవన్‌పాల్‌రాజ్, తృతీయ బహుమతి జి.హర్షిణి అందుకున్నారు. అధ్యాపకులు దేవదానం, వెంకటేశ్వరరెడ్డి, విక్టోరియా, మల్లికార్జున, విద్యార్థులు పాల్గొన్నారు.

- ఇంకొల్లు, దుద్దుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రెగ్యులర్ ల్యాబ్ టెక్నీషియన్‌లు లేక ఇక్కట్లు
- వైద్య పరీక్షలు చేసేవారేరీ?
- రెగ్యులర్ ఎల్టీలకు జీతం ఒకచోట.. విధుల నిర్వహణ మరో చోట
- సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న రెండు గ్రామాల ప్రజలు
- పట్టించుకోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు



ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

రోగాలమయం.. పరీక్ష సమయం

ఇంకొల్లు(చినగంజాం): ఇంకొల్లు మండలంలోని ఇంకొల్లు, దుద్దుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రెగ్యులర్ ల్యాబ్ టెక్నీషియన్‌లు అందుబాలో ఉన్నప్పటికీ వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల నిర్వాకం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీజనల్ వ్యాధులు తీవ్రంగా ప్రబలుతున్న ప్రస్తుత సమయంలో రెగ్యులర్‌గా ల్యాబ్ టెక్నీషియన్‌లు ఆసుపత్రుల్లో సకాలంలో అందుబాటులో ఉండటం లేదు. ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించే ల్యాబ్ టెక్నీషియన్ శేషను రాజకీయ ప్రాబల్యంతో కొరిశపాడుకు డిప్యుటేషన్‌పై పంపి అక్కడి విధులు కేటాయించారు. డిప్యుటేషన్‌పై వెళ్ళిన వ్యక్తి ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జీతం తీసుకుంటూ విధులు మాత్రం అక్కడ నిర్వహిస్తున్నాడు.

దుద్దుకూరు పీహెచ్‌సీలో పని చేస్తున్నఎల్టీ సతీష్‌ను ఇంకొల్లుకు కేటాయించారు. దీంతో దుద్దుకూరు పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలు రోగాలబారిన పడుతూ పరీక్షించేవారు లేక అల్లాడుతున్నారు. వారం రోజులలో సగం రోజులు ఒకచోట, మిగిలిన సగం మరొక చోట విధులు నిర్వహించాల్సి ఉన్నా.. ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలియడంలేదు.

దాతల సాయంతో ముందుకు నడుస్తున్న పీహెచ్‌సీ

దుద్దుకూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దాతల సాయంతో నడుస్తోంది. గ్రామానికి చుట్టు పక్కల ఉన్న 11 గ్రామాలకు పైగా జనాభాకు ఈ ఆసుపత్రి ముఖ్యం కావడంతో గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ రాయని సుబ్బరామయ్య, గ్రామస్తులు సహాయ సహకారాలతో ఆసుపత్రికి విలువైన సామగ్రిని అందజేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ల్యాబ్ టెక్నీషయన్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులో లేకుండా చేయడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మహిళల సహాయం కోసమే శక్తి యాప్



శక్తియాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఒన్‌టౌన్ సీఐ సుబ్బారావు, శక్తి టీం సభ్యులు

చీరాల అర్బన్: అత్యవసర సమయంలో మహిళలకు తక్షణ సహాయం పొందేందుకు శక్తి యాప్ ఎంతో ఉపయోగపడుతుందని ఒన్‌టౌన్ సీఐ ఎస్.సుబ్బారావు అన్నారు. ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు బుధవారం చీరాల్లోని అంబేడ్కర్ భవన్‌లో నారాయణ స్కూల్ విద్యార్థినులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆపద సమయంలో తక్షణ సహాయం కోసం శక్తి యాప్ ఉపయోగపడుతుందన్నారు. ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా, బాల్య వివాహాలు అరికట్టేందుకు ఉపయోగపడుతుందన్నారు. గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ గురించి తెలియజేస్తూ అలా మనల్ని ఎవరైనా ఇబ్బంది పెడితే తల్లిదండ్రులకు, స్కూల్‌లో ఉపాధ్యాయులకు చెప్పాలన్నారు. రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో విద్యార్థులకు సోషల్ మీడియాలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లో వచ్చే ఫేక్ న్యూస్‌లతో అప్రమత్తంగా ఉండాలన్నారు. హెల్ప్‌లైన్ నెంబర్లు 100, 112 కు సమస్య వచ్చినప్పుడు డయల్ చేస్తే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మహిళా ఎస్సై జి.రాజ్యలక్ష్మి, శక్తిటీం ఎస్సై ఎ.హరిబాబు, సిబ్బంది కె.సుబ్బారావు, సునీత, ధనలక్ష్మి, స్కూల్ ప్రిన్సిపాల్ తదితులు పాల్గొన్నారు. అలానే ఈపురుపాలెం పరిధిలోని గవినివారిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ మొయిన్ సూచనలతో శక్తి బృందం ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈపురుపాలెం ఎస్సై ఎ.చంద్రశేఖర్, ట్రైనీ ఎస్సై అలేఖ్య హాజరయ్యారు. శక్తి యాప్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చినగంజాంలో విద్యుత్ అధికారుల ఆకస్మిక తనిఖీ



విద్యుత్ ఆకస్మిక తనిఖీ సమాచారం సమావేశంలో వివరిస్తున్న అధికారులు

చినగంజాం: మండలంలో విద్యుత్ అధికారులు బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. చీరాల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కే జాన్ థామస్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మొత్తం 68 మంది విద్యుత్ సిబ్బంది 34 బ్యాచ్‌లుగా ఏర్పడి 12 గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్ వినియోగించుచున్న 14 మందిపై రూ. 61,500 అపరాధ రుసుం విధించారు. అదనపు లోడు వినియోగిస్తున్న 17 మందిపై రూ 1,41,000, మరొక కేటగిరీలో విద్యుత్ వినియోగిస్తున్న 8 మందిపై రూ. 15,700 అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో బాపట్ల విజిలెన్స్ డిప్యూటీ ఇంజినీర్ విజయ శ్రీనివాసులు, వేటపాలెం డిప్యూటీ ఏఈ పీ శ్రీనివాసరావు, చీరాల డీఈఈ జె. శ్రీనివాసరావు, చినగంజాం అసిస్టెంట్ ఇంజినీర్ ఎల్. బ్రహ్మం, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

సుప్రీం ప్రధాన న్యాయమూర్తిపై దాడి దారుణం



చీరాల గడియార స్తంభం సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు

చీరాల రూరల్: దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై మతోన్మాద న్యాయవాది చేసినదాడి హేయమైనదని, ఆ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని కుల వివక్ష పోరాట సమితి, సీఐటీయూ, వివిధ ప్రజా సంఘాల నేతలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక గడియార స్తంభం సెంటర్లో ఆయా సంఘాలకు చెందిన నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. వసంతరావు, కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు లింగం జయరాజు, దళిత మహాసభ రాష్ట్ర నాయకుడు నూకతోటి బాబురావు, బీఎస్పీ జిల్లా నాయకుడు కాటి మార్కు, బలహీనవర్గాల సమాఖ్య రాష్ట్ర నాయకుడు గోసాల ఆశీర్వాదం, సీపీఎం కార్యదర్శి నలతోటి బాబురావు మాట్లాడారు. సుప్రీం కోర్టులో సోమవారం మధ్యప్రదేశ్‌కు సంబంధించిన ఓ కేసు విచారణ జరుతుండగా న్యాయవాది కిషోర్ తన కాలిబూటు సీజేఐ బీఆర్ గవాయ్‌పై విసిరి దాడిచేసేందుకు ప్రయత్నించడం బాధాకరమైన విషయమన్నారు. ఈ దాడి ఒక వ్యక్తిపై చేసిన దాడి కాదని భారతదేశం ప్రామాణికం భారత రాజ్యాంగంపై దాడిగా పేర్కొన్నారు. అన్ని ప్రపంచ దేశాలముందు ప్రజాస్వామ్య ఔన్నత్యాన్ని కించపరచే చర్యన్నారు. సనాతన ధర్మం ముసుగులో రాజ్యాంగ న్యాయవ్యవస్థపై చేసినదాడని, దేశ విద్రోహ చర్యని వారు తెలిపారు. ఒక మతాన్ని ప్రాతిపదికగా తీసుకుని దేశ రాజ్యాంగాన్ని అవమానపరచడం దేశభక్తి ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఇటువంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతు మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ రాజకీయ లబ్ది పొందుతున్న ఆర్ఎస్ఎస్ సంస్థను నిషేధించాలని వారు ముక్త కంఠంతో కోరారు. ఎర్రకోట సాక్షిగా జాతీయ జెండాను ఎగురవేసిన దేశప్రధాని మోదీ ఆర్ఎస్ఎస్‌ను కొనియాడడం సిగ్గుచేటని వారు విమర్శించారు. సీజేఐ గవాయ్‌పై మతోన్మాదులు ఒక పథకం ప్రకారం దాడిచేశారని, గవాయ్ ఒక దళితుడనే కారణంతోనే దాడికి తెగబడ్డారని ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్దమని పేర్కొన్నారు. ఈ దాడి సంఘటనపై రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాన మంత్రి స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య, శవనం శామ్యూల్, వి. భగవాన్ దాసు, యడం రవిశంకర్, బి. సుబ్బారావు, బి. అబ్రహం, ఎస్కే జిలానీ, ఐవీ ప్రసాద్, కేబీకే రెడ్డి, వై. నాగిరెడ్డి, బి. విమలాకర్, జె. రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వేటపాలెం గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



గ్రంథపాలకురాలు శ్రీవల్లికి పుస్తకాలు బహూకరిస్తున్న శ్రీరామచంద్రమూర్తి రెడ్డి

చినగంజాం: మండల కేంద్రం చినగంజానికి చెందిన కవి, సాహితీవేత్త కుక్కల శ్రీరామచంద్రమూర్తి రెడ్డి బుధవారం వేటపాలెంలోని సారస్వత నికేతనం గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరించారు. గ్రంథాలయాన్ని సందర్శించిన ఆయన విద్య నభ్యసించే విద్యార్థులకు అవసరకమైన జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను ఒక్కొక్కరికి ఇచ్చి దాంతో పాటు పెన్నులను అందజేశారు. వీటితో పాటు షార్ట్ హ్యాండ్ పుస్తకం, వివిధ కవులు రచించిన పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు, సైన్స్ పుస్తకాలు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి పుస్తకాలు, పెన్నులు బహూకరించారు. వీటిని గ్రంథపాలకురాలు శ్రీవల్లికి అందజేశారు. అనంతరం ఆయన తెలుగు భాషాభివృద్ధి గురించి వివరించారు. భవిష్యత్‌లో తెలుగు బాషాభివృద్ధి పర్యవేక్షకులుగా ఉండాలన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై జనార్ధన్

వేటపాలెం: విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా మెలగాలని ఎస్సై పి. జనార్ధన్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ పాలికోన్నత పాఠశాలల్లో నేరాలు, చెడు ప్రవర్తనలపై విద్యార్థులకు బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు చెడు స్నేహాలు, మాదకద్రవ్యాలు, ఇన్‌స్టాగామ్ లాంటి సోషన్ మీడియాతకు దూరంగా ఉండాలన్నారు. బడి లోపల, బడి బయట మంచి ప్రవర్తన కలిగి ఉండాలని తెలిపారు. సైబర్ నేరాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి పరిసరాల్లో ఎవరైనా పిల్లల, కుటుంబ సభ్యుల ఇతరుల పట్ల అనుచింతంగా ప్రవర్తిస్తే వెంటనే 112కి ఫోన్ చేయాలని సూచించారు. ఉపాధ్యాయుల నుంచి ఇబ్బందికర సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే ప్రధానోపాధ్యాయులకు, స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలన్నారు. పాఠశాల పరిసరాల్లో జరిగే అన్ని కార్యకలాపాలపై సీసీ కెమెరాల ద్వారా నిఘా ఉంచడం జరిగిందని తెలిపారు. బడి లోపల, బడిబయట ఏవరైనా చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడితే వెంటనే అరెస్ట్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు, ఉమ్మిటి వేణుగోపాలరావు, స్టాఫ్ సెక్రటరీ కాల్వ సోమశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన



జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

చీరాల అర్బన్: ప్రభుత్వ ఆదేశానుసారం జీఎస్టీ తగ్గింపుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టినట్లు వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.మురళి తెలిపారు. బుధవారం పట్టణంలో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి చీరాల మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలు వినియోగించే పలు వస్తువులపై జీఎస్టీని తగ్గించిందని, బీమా రంగంలో జీఎస్టీని తీసివేసిందన్నారు. ప్రజలకు ఉపయోగపడే మందులు, నిత్యావసరాల వస్తువులపై జీఎస్టీ తగ్గించడం వలన పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. వారం రోజులు పాటు జరిగే అవగాహన కార్యక్రమాల్లో సదస్సులు, వక్తృత్వం, క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.మురళి తెలిపారు.

డీజే సౌండ్ బాక్సులు వాడితే చర్యలు

యర్రగొండపాలెం: డీజే సౌండ్ బాక్సులు వాడరాదని, వాటినుంచి వచ్చే అమిత శబ్దాలకు చిన్నపిల్లలు, గుండెజబ్బు ఉన్నవారు, వృద్దులు అనేక సమస్యలకు గురవుతున్నారని సీఐ సీహెచ్ ప్రభాకరరావు, ఎస్సై పి.చౌడయ్య బుధవారం తెలిపారు. ఈ కారణాల వలన డీజే సౌండ్ బాక్సుల వాడకాన్ని రద్దు చేస్తున్నామన్నారు. శుభకార్యక్రమాలు, ఉత్సవాలు, ఊరేగింపులు, తిరునాళ్ల జరుపుకునే సమయాల్లో పోలీస్ అనుమతులు తీసుకోవాలని, పర్మిషన్ పొందినవారు మైకులు, ఇతర సౌండ్ బాక్సులు పరిమిత సంఖ్యలో వాడుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న మానసిక వైద్యురాలు పద్మావతి

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కెరీర్ గైడెన్స్ మానసిక నిపుణురాలు కడెం పద్మావతి పిల్లలకు మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనూష తదితరులు పాల్గొన్నారు.


వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోండి



అవగాహన కల్పిస్తున్న కెరీర్ అండ్‌మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ఎస్ ప్యారీ జాన్

ఇంకొల్లు(చినగంజాం): విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకునేందుకు కృషి చేయాలని కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ఎస్ ప్యారీ జాన్ తెలియజేశారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులకు స్వీయ పరిశీలన, ఇంట్రా స్పెక్షన్ అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ ఆలోచనలు, భావాలు, ప్రవర్తనను విశ్లేషించుకోవడం ద్వారా వ్యక్తిత్వ వికాసం సాధించగలరని జీవితంలో సానుకూల మార్పులు తీసుకురావచ్చని వివరించారు. కేరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ఎస్ ప్యారీ జాన్ ప్రధాన వక్తగా పాల్గొని విద్యార్థులకు మానసిక ఆరోగ్యం ప్రాథాన్యతను వివరించారు. ఆమె 8 గంటల నిద్ర, 8 గంటల చదువు, 8 గంటల విశ్రాంతి.. కుటుంబంతో గడపడం, జీవనశైలిని అనుసరించడం ద్వారా మానసిక ఆరోగ్య కాపాడుకోవచ్చుని సూచించారు. అదే విధంగా స్వీయ అవగాహన, కృతజ్ఞత, ఆత్మవిశ్వాసం వంటి విలువలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో ఎంత ముఖ్యమో వివరించారు. హెచ్‌ఎం పిడవర్తి పేరిరెడ్డి విద్యార్థులు అవగాహన కార్యక్రమాల ద్వారా జీవితంలో సానుకూల దృక్పథం పెంపొందించుకోవాలని సూచించారు. ఎస్ఎంసీ చైర్మన్ ఏ. భూపతి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బొద్దికూరపాడు వాసికి నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రవిచంద్ర

తాళ్లూరు: మండలంలోని బొద్దికూరపాడు గ్రామానికి చెందిన బేతేల్ గాస్పల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు పాస్టర్ రవిచంద్రకు నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు లభించింది. అక్టోబర్ 5వ తేదీ ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ నేషనల్ ప్రెసిడెంట్ జి.విజయ కుమార్ ఆధ్వర్యంలో అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ వైస్ చైర్మన్ శేఖర్ లూక్ చేతుల మీదుగా మంగళవారం పాస్టర్ రవిచంద్ర అవార్డు అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో చిన్న పిల్లలకు ఆత్మీయ మానసిక సామాజిక విషయాలను ఆయన బోధింస్తుంటారు. ఈ సందర్భంగా మండల వాసులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం మిన్న



ప్రకృతి వనరుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్

సంతమాగులూరు (అద్దంకి రూరల్): ప్రతి రైతు తనకున్న భూమిలో కొంత భాగం ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు పండించుకోవాలని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సయ్యద్ అక్తర్ హుస్సేన్ అన్నారు. బుధవారం సంతమాగులూరు మండలంలోని సజ్జాపురం, ఏల్చూరు, పుట్టావారి పాలెం గ్రామాల్లో ప్రకృతి వనరుల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్తర్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు పండించటం వల్ల భూమి ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. రైతులంతా బయోరిసోర్సు కేంద్రాన్ని వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సైదా, ప్రకృతి వ్యవసాయ విభాగం అడిషనల్ డీపీఎం మోహన్, గ్రామ మాజీ సర్పంచ్ ఆంజనేయులు, శ్రీనిధి మేనేజర్ శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయ విభాగం మాస్టర్ ట్రైనర్ టి. శిరీషా, ప్రకృతి వ్యవసాయ యూనిటీ చార్జెస్, కమ్యూనిటీ రిసోర్సు పర్సన్లు, రైతులు పాల్గొన్నారు.

సుఖవ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

దర్శి: హెచ్ఐవీ, సుఖవ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ ఐవీ సుబ్బారావు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఉనాతన్ అధ్యక్షతన విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ సాక్స్, జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ, కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఎయిడ్స్, సుఖ వ్యాధులు, డ్రగ్ డీ–అడిక్షన్ గురించి వివరించారు. ప్రజలు హెచ్ఐవీకి గురికాకుండా చూసుకోవచ్చని, చికిత్స కన్నా నివారణ మంచిదని తెలిపారు. హెచ్ఐవీ కేవలం అసురక్షిత లైంగిక సంబంధాలు, హెచ్ఐవీ ఉన్న గర్భిణీ నుంచి పుట్టబోయే బిడ్డకు సంక్రమిస్తుందన్నారు. హెచ్ఐవీతో కలుషితమైన సూదులు, సిరంజీలు, పరీక్షింపబడని రక్తం ద్వారా మాత్రమే సంక్రమించే అవకాశం ఉందని తెలిపారు. ఇక ప్రభుత్వ ఆస్పత్రులలో హెచ్ఐవీ పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పరీక్షలు చేయించుకున్న వారి వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు. అదేవిధంగా, హెచ్ఐవీ ఉందని నిర్ధారణ అయితే జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏఆర్‌టీ కేంద్రాలు, లింక్ ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా ఉచితంగా ఏఆర్‌టీ మందులు అందుబాటులో ఉన్నాయని, మందులు వాడుతూ, వైద్యుల సలహాలు పాటిస్తే ఎటువంటి ఆరోగ్యపరమైన ఇబ్బందులు లేకుండా జీవితం కొనసాగించవచ్చని తెలిపారు.

మిరప పంటను పరిశీలించిన ఉద్యానవన శాఖాధికారి



మిరప పంటను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారి

కురిచేడు: మండలంలోని దేకనకొండ, నమస్సివాయపురం గ్రామాల్లో మండల ఉద్యానవనశాఖ ఇన్‌చార్జి అధికారిణి బి.ధనలక్ష్మి బుధవారం ఈ పంట నమోదుతో పాటు సూపర్ చెక్ రికార్డుల తనిఖీ నిర్వహించారు. ఖరీఫ్‌లో సాగుచేసిన ప్రతి పంటను డిజిటల్ క్రాప్ సర్వే తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గడువులోగా పూర్తి చేయాలని, అలా చేసిన రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. రైతులంతా వారు సాగుచేసిన పంటలను గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా నమోదు చేయించుకోవాలని సూచించారు. మిరప పంటను పరిశీలించి ప్రస్తుతం మిరపలో తామర పురుగులున్నట్లు గుర్తించారు. నివారణకు నీలి రంగు అట్టలు అమర్చాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో గుండెపోటుతో ఒడిశా వాసి మృతి



గుండెపోటుతో మృతి చెందిన సుదర్శనంపాల్

పెద్దదోర్నాల: ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న ఒడిశాకు చెందిన వృద్దుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన పెద్దదోర్నాలలో బుధవారం జరిగింది. వివరాల మేరకు ఒడిశాకు చెందిన ఓ వలస కుటుంబం దర్శి పట్టణంలో రంగులరాట్నం ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో ఇటీవల రంగులరాట్నం యజమాని సుదర్శనంపాల్ అస్వస్థతకు గురయ్యాడు. దీంతో వైద్యుల సలహా మేరకు పరీక్షలు నిర్వహించుకునేందుకు భార్యతో కలిసి కర్నూలుకు బయలుదేరారు. ఈ క్రమంలో దర్శి నుంచి దోర్నాల చేరుకున్న దంపతులు కర్నూలు వెళ్లేందుకు మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండులో వేచి ఉన్న సమయంలో సుదర్శనంపాల్ మరోమారు గుండెపోటుకు గురయ్యాడు. దీంతో స్థానికులు కొందరు హుటాహుటిన వైద్యశాలకు తరలించి చికిత్సలు నిర్వహిస్తుండగా సుదర్శనంపాల్ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.